# నామకరణం

* ఉమామహేశ్వరరావు *

[మొదటిసారి కాన్పు వినేసరికి పడుచుదంపతులకు అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. భర్తకు ఒకవిధమైన అహంభావం, భార్యకు చంటిపిల్లల సరదా తీరబోతోందనే అత్యానందం లోలోన మెలగుతూంటాయి. ఎటొచ్చీ ఈ భావాలు వారిద్దరిమధ్య నడిచే ప్రసంగాల్లోనేకాని ఇతరత్రా వినబడవు. ప్రతీ యువతికి ముందుగా మగపిల్లవాడుకలగాలనే కోరికవుండడం సహజం. ఆ కోరికలను అనుసరించే ముందునుంచి ఆఅబ్బాయికి ఏం పేరు పెట్టాలో అని పెద్ద ఆలోచన. అలాంటి ఆలోచనతీరు ఎలావుంటుందో ఉమామహేశ్వరరావుగారి కథలో చక్కగా పొందుపరచారు.]

★

“అబ్బబ్బ—విసుగెత్తి పోతూందండి పిలవలేక.”

..............................

“ఇదిగో! ఒక్క మాట.”

..............................

“మిమ్మల్నే నండి!”

..............................

“దేవుడైనా పలుకుతాడండీ! యింతగా అరుస్తుంటే.” యీసారి సరస్వతి స్వరం మారింది. క్రోధం కొద్దీ లేచివెళ్ళబోతూ, మరోసారి ప్రయత్నం చేద్దామని కాబోలు ఆగిపోయింది,

విసుక్కుంటూ, ఆ పూటకి—దిద్దే పేపర్లకి స్వస్తిచెప్పి నేను ఆమెప్రక్కకు తిరగక తప్పింది కాదు.

“ఎందుకంత కంఠశోష? ఏం పుట్టి మునిగి పోయిందని?” అన్నాను. చివరనవ్వు వచ్చినమాట వాస్తవం—యింతసేపూ ఆమెకు కళ్లనీళ్లపర్యంతం తెప్పించినందుకు.

“ఏం మాటలండీ! అవి—ఏం పుట్టాలా! మునగాలా! చెప్పేదేమి వినకుండా కసురుతారేం?”

“ఏమిటో చెప్పేది త్వరగా చెబుదూ చంపక. ఉయ్యాలమాటేనా!”

“అబ్బ కాదండీ!” అంటూ వచ్చి కుర్చీ అంచుమీద కూర్చుంది.

“మరేమిటండీ!—తొట్టిబండి మాటా?”

“ప్చ! ఏం ఎగతాళి చేస్తారండీ! మీతో మాట్లాడటమే కష్టమై పోతూంది.”

“కావలసింది చెప్పరాదూ! ఏమిటో!”

“మనకి అబ్బాయి...... ఉహుఁ—ఏమిటండీ! మళ్ళీ నాచేత అనిపించాలేం?—ఆమాటలు తెలియదూ?”

“అయితే యేమిటీ? పాలపీసా మాటా!”

“పోదురూ! బ్లాక్ మార్కెట్లున్నాయి కదండీ”

ఇప్పుడు నిజానికి ఆమెను మొదట యేడిపించగలిగానన్న సంతోషం పూర్తిగా మాయమైపోయింది నాకు. విషయం యేమిటో చెప్పకుండా చంపుతుంది. ఏం మాట్లాడకబోతే—“మూగనోములా, మూసివాయినాలాతో ఆరంభించి మాతి ముడుపులూ కళ్లప్పగింతల వరకు” పోతుంది గ్రంథం. పోనీ చెప్పేది వెంటనే చెప్పరాదూ? యేమిటా కుంభకోణం?—అది ఆమెకు అలవాటులేనిపని. పైగా, వట్టి అనుమానం, పరమఛాందసం, చెడ్డమూర్ఖత్వం.

“తెల్లవారితే—పేపర్లు దిద్ది యివ్వకపోతే, కుర్రాళ్లు నానాగోల చేస్తారుసుమా! నీకు పుణ్యముంటుంది. అదేమిటో చెప్పుదూ’ అంటూ మెల్లిగా చేయినొక్కుతూ అడిగా.

"పేరండీ! అపుడే మరచారు." అంది నవ్వుతూ.

"ఇప్పట్నించి యెందుకీ ఆలోచన? అప్పుడే చూద్దాములే"

"ఇప్పట్నించీ అంటారేం? శ్యామల గారింట్లో, అప్పుడే వాళ్లు పుట్టబోయే అబ్బాయికి శ్యామసుందర మదనమోహన హరిహర వేణుగోపాల మూర్తి అని పేరుపెట్టుకున్నారు. ముద్దుగా చిన్నప్పుడు శ్యామూ అని పిలుచుకుంటారట కూడా. శ్యామల యెంత చెపితే అంత."

"నేను మాత్రం నీ మాట కాదన్నదెప్పుడు? చెప్పరాదూ?"

"కాదండీ ఆమాట నేనన్నానా?"

"నీ యిష్టం యేదో పేరుపెట్టు. అంత పేరు మటుకు వద్దు." అన్నా, ఆ పేరు తలచుకుంటేనవ్వు రావడం వల్ల.

"అదిగో నా యిష్టం అంటారు. మీ కిష్టం లేకుంటే నాకెందుకూ యివన్నీ?" అని ప్రణయ కోపం నటిస్తూ లేచింది కుర్చీ అంచుల మీదనుంచి. అనుకోకుండా చేయిపట్టుకున్నాను. చేయి విడిపించుకుని మళ్లీ కూర్చుంది.

"మీకు తోచిన పేరొకటి చెపితే ఉంటా! లేకపోతే..." అని ఊరుకుంది ధీమాగా, తానుచేసిన ప్రయత్నాన్ని స్ఫురణకు తెస్తూ.

"గిరీశం" అన్నా లోపల నవ్వుకుంటూ.

"ఏమిటండీ వేళాకోళం. సినీమా బారిష్టర్ పార్వతీశంలా" పెదవి విరిచింది.

"శివనాథన్ అందాం, బాగుందా? యిట్లాంటి పేర్లతో మన తెలుగు వాళ్లెంతో గొప్ప వాళ్ళయారు."

"ఆ! బాగుంది. తెలుగువాడికి అరవపేరెందు కండీ? ఇల్లాపేర్లు పెట్టుకుంటేనే పిల్లిళ్లలో యిబ్బంది పడాల్సి వస్తుంది."

"పోనీ శర్మ అందాం"


## అజంతా చిత్రాలు!



ఆనాడు యేనాడో వ్రాసిన అజంతా చిత్రాల లోని స్త్రీలు అందగత్తెలు. ఆ అందచందాలు ఆ కళా కోమలత్వాలు యీనాటి మహిళా మండలిలో అరుదు. మాతృత్వానికి అర్హత నిచ్చే పరిపూర్ణారోగ్యం ఈనాటి స్త్రీలలో లోపించింది. విడువకుండా "అరుణ" వాడితే ప్రత్యేకంగా స్త్రీలకు యేర్పడే గర్భ సంబంధమయిన రుగ్మతలు అన్నీ తప్పకుండా అంతరిస్తవి. పరిపూర్ణారోగ్యం లభ్యమాతుంది.

అరుణ

ఋతు సంబంధ దోషాలను అద్భుతంగా నివారించి, ప్రతి స్త్రీకి మాతృత్వ గౌరవాన్ని కలిగించగల ఉత్తమ రసాయనం.

(అన్ని మందుల షాపులలోనూ దొరకును)

ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోవింద నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్, మద్రాసు.

"శర్మ! ఏం శర్మండీ! మరీ చిన్నదై పోలా?"

"పోనీ యేదైనా మంచి యింగ్లీషువాళ్ల పేరు పెడదామా!" అన్నాను.

వాక్యం వింటూనే అగ్నిహోత్రంలా, "ఎప్పుడూ పనికిరాదు. గాంధిగారి దేశంలో పుట్టినసంగతి మరచిపోతారేమండీ? ఇంగ్లీషువాళ్లు మనకు శత్రువులని మీరేగా నాకుచెప్పింది." అంది యేదో పెద్దతప్పు పట్టుకో గలిగానని మురుస్తూ.

"అవును. 'సుభాస్ బాబు' అంటే నచ్చుతుందికదూ? మహానుభావుడు. భారతదేశంలో వీరుడు?"

"పెద్దవాడైన తరువాత అంతటివాడు కాకపోతే అందరూ నవ్వరుటండీ?"

"పోనీ నీకు తోచింది చెప్పరాదూ?"

"నాకుతోస్తే మిమ్మల్నెందుకండీ అడగటం?" అంది కళ్లుతిప్పుతూ.

"అయితే మా నాన్న పేరుపెట్టనా. 'రామచంద్రుడు' అని. పుణ్యం పురుషార్థం కూడా. రామూ అని ముద్దుగా పిలుచుకోవచ్చు. సాంప్రదాయానుగుణ్యంగా వుంటుంది."

నాచొక్కా కాలర్ సద్దుతూవున్న తన రెండుచేతులు ఒక్కసారితీసి "నావైపు యెంత బలం వున్నా లేనట్టేజమ. ఎందుకొచ్చింది.! మీవాళ్లంటే మీకు అభిమానం సహజం" అంది వింతగా కోపం తెచ్చుకుంటూ.

"పోనీలే! నీ కిష్టం వుంటేనే—కావాలన్నావు కనుక చెప్పాను. పోనీ! మీ నాన్న పేరు పెడితే 'జోగయ్య' అని." తండ్రిపేరు చెప్పేటప్పటికి ఆమె మొఖం వికసించింది.

"నేనూ అనుకున్నా, కాని యేమిటో నండీ! నాకా పేరు వింటే మీద గొంగళీ పురుగు ప్రాకినట్లుంది."

"'చిట్టి' అందాం!"

"మరీను. ఆఖరికీ చిట్టీ—పొట్టీను. ఊరూ పేరు లేకుండా పోవడానికి."

"రామావధాన్లుపేరు? చూడు. బాగుంటుందేమో?"

"ఈరోజుల్లో పాతకాలపు పేరు నాకు నచ్చదండీ! మీస్కూల్లో, అన్నట్టు, మీ రెరుగున్న పిల్లల పేర్లు చెప్పండీ! అందులో యెవరిదైనా మంచిపేరుందేమో?"

"వేణు, శ్రీధర్, సీతారామారావు చూడు యీ పేర్లు."

"యింకా"

"బుచ్చయ్య, గుర్రాజు, శ్రీమన్నారాయణ" ఆగాను.

"ఇంకా చెప్పండీ! వాటిలో యేమిబాగాలేవు" అంది, తలవూపి నిస్పృహతో.

"రామాచారి, షరీఫ్ సూరన్న పంతులు, శామ్యులు, దీక్షితులు సూరిశాస్త్రి, లక్ష్మణమూర్తి" అని విసుగుపుట్టి యేకరువు పెట్టాను.

"బాగూ లేవండి వ్చ్! ఇందులో నాకేపేరు బాగుండ లేదు-" అంది.

"నానోరు పడిపోతూంది. ఈపూట కవి దిద్దినట్లై, ఉదయమైన యేడ్వాలి" అన్నా, యీ నెలలో మళ్ళి పేపర్లవంక దృష్టిపోయి.

"అదిగో మా అమ్మ వస్తూంది" అంటూ చటుక్కున కుర్చీ మీదనుంచి లేచింది.

ఇంతలో ఆవిడ వంటిల్లంతా సర్దుకొని, మరచెంబునీళ్ళు తెచ్చారు. ఎంత సేపటి నుంచి వింటూన్నారో! మిమ్మల్ని చూసి కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వుతూ,

"ఎంత రాద్ధాంతం చేస్తూన్నారు! తీరా ఆడపిల్ల పుడితే?......" అన్నారామె వెళ్లేటప్పుడు వెనక్కు తిరిగి. "మళ్లీ యింత హడావుడీ" అనుకుంటూ లోపల పూర్తి చేసుకున్నా సిగ్గుపడి: నాకు గుటుక దిగింది కాదు. తెల్లబోయి ఒకళ్ల మొగాలవంక ఒకళ్ళం చూసుకున్నాము. తీరా ఆడ పిల్ల పుడితే యేం పేరు పెట్టాలా? అన్నట్లు ప్రశ్నార్థకంగా!